

శుభ్రతకే ప్రాధాన్యం

ఆధ్యాత్మిక తిరుపతి శుభ్రతకే ప్రాధాన్యమివ్వనున్నట్లు నగరపాలక కమిషనర్ స్పష్టం చేశారు. - 8లో



చిత్తడి నేలలపై అవగాహన

ఎస్వీ జూపార్క్‌లో ప్రపంచ చిత్తడి నేలల సంరక్షణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. - 8లో



ఆదర్శప్రాయుడు..వివేకానందుడు

స్వామీ వివేకానంద ఆదర్శప్రాయుడని శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి కొనియాడారు. - 8లో

న్యూస్‌రీల్

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. మరోవైపు ఇళ్లు పొందిన వారు నిర్మాణాలు పూర్తి చేసుకునేలా పురోగతి చూపాలని హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ అధికారులు అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సమర్థవంతంగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఈవో వీ.శేఖర్, సుశీలాదేవి, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి జయలక్ష్మి, నోడల్ అధికారి వాసంతి, డీసీపీఓ శివశంకర్, డీఎల్డీఓ ఆదిశేషారెడ్డి, వాణి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

4న హాకీ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీయూ క్రీడా మైదానంలో జూనియర్స్, సబ్ జూనియర్స్ హాకీ బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు, అలాగే గూడూరులో సబ్‌జూనియర్స్ బాలుర హాకీ జిల్లా జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఆ మేరకు తిరుపతి జిల్లా హాకీ సంఘం కార్యదర్శి బీ.ఆదిత్య ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎంపిక పోటీలకు ఆధార్, పదో తరగతి మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్‌ను వెంట తీసుకురావాలని తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హాకీ పోటీలు, 10 నుంచి 12వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీలకు ఎంపిక చేసిన జిల్లా జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 77028 65721 నంబరులో రమేష్‌కృష్ణను సంప్రదించాలని ఆయన కోరారు.

పర్యావరణవిద్య పరీక్ష 23కు వాయిదా

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు శనివారం నిర్వహించనున్న పర్యావరణ విద్య పరీక్ష ఈనెల 23కు వాయిదా వేశారు. ఆ మేరకు రాష్ట్ర ఇంటర్ బోర్డు సీఓఈ వీవీ.సుబ్బారావు గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) జీవి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 23న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలోపు ఈ పరీక్షను నిర్వహించాలని ఆర్ఐఓ కోరారు.

మ్యాథ్స్ గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా, తడ మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదిక మ్యాథ్స్ సబ్జెక్టు బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ మ్యాథ్స్ విద్యార్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, మరింత సమాచారానికి ఆ విద్యాలయ ప్రిన్సిపల్‌ను 90521 56838, సమగ్ర శిక్ష అసిస్టెంట్ జీసీడీఓను 94418 63994 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

అలిగి ఆలయంలో నిద్రించి.. పోలీసులకు చిక్కి!

- పోలీసులకు అప్పగించిన స్థానికులు నిద్దరోతున్న ఆలయ నిఘా

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం మూడో గేటు వద్ద గోడ దిగుతున్న ఓ బాలుడిని స్థానికులు గుర్తించి ఎస్పీఎఫ్ పోలీసులకు అప్పగించిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. 1వ పట్టణ సీఐ నరసింహారావు కథనం .. తొట్టంబేడు మండలం, వినాయకనగర్‌కు చెందిన బాలుడు పార్థు పట్టణంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో చదువుతున్నాడు. అయితే అతడు సరిగా చదవడం లేదని తల్లి మందలించడంతో బుధవారం రాత్రి అలిగి ఆలయ వద్దకు వచ్చేశాడు. ఆలయ అన్నదానంలో భోజనం చేసి.. రూ.500 రాహుకేతు మండపం (అంజి అంజి వినాయకుని ఆలయం వద్ద) నిద్రించాడు. అర్ధరాత్రి లేచి చూసే సరికి అన్ని గేట్లు వేసి ఉండడంతో మూడో గేటు పక్కన ఉన్న నిచ్చెన పట్టుకుని గోడ దిగాడు. ఇంతలో అక్కడ ఉన్న వారు ఆ బాలుడిని పట్టుకుని ఆలయ పోలీసులకు అప్పగించారు.

ఎస్పీఎఫ్ అధికారుల నిర్లక్ష్యం

ఆలయానికి గేట్లు వేసే సమయంలో ఆలయ సిబ్బంది, ఎస్పీఎఫ్ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి ఉంది.అయితే ఈ బాలుడు నిద్రిస్తున్నా గుర్తించకపోవడంతో వైఫల్యం అని అర్థమవుతోంది.

గుర్తిద్దాం.. జయిద్దాం!

మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ బస్



నిరుపేదలకు పెనుభారంగా మారిన క్యాన్సర్‌కు కళ్లెం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. వ్యాధిని ఆదిలోనే గుర్తించి సకాలంలో వైద్యాన్ని అందించాలని నిర్ణయించింది. తద్వారా ఆ రోగులను సాధారణ స్థితికి తీసుకురావొచ్చని భావిస్తోంది. ఈమేరకు ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు శ్రీకారం చుట్టనుంది. ఇందుకు తిరుపతి జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఆపై దశలవారీ రాష్ట్ర వ్యాప్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించనుంది. దీని కోసం జిల్లా వైద్యఆరోగ్యశాఖ సమన్వయంతో, సచివాలయ వ్యవస్థ సహకారంతో ప్రణాళికాబద్ధంగా నిర్వహణకు సంకల్పించింది.

– సాక్షి, తిరుపతి డెస్క్

క్యాన్సర్ మహమ్మారి కట్టడికి చర్యలు

- ముందుగానే గుర్తించేందుకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు
- స్క్రీనింగ్ పరీక్షల కోసం రెండు ప్రత్యేక బస్సులు
- పైలెట్ ప్రాజెక్టుగా తిరుపతి జిల్లా ఎంపిక
- 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శ్రీకారం
- వైద్యఆరోగ్యశాఖ, సచివాలయ వ్యవస్థ సహకారం

క్యాన్సర్ మహమ్మారిని ముందుగా గుర్తిస్తే మట్టికరిపించవచ్చు. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి సరైన చికిత్స చేయడం వల్ల 90 శాతం వరకు నయం చేయొచ్చు. అదే రెండో దశలో ఇచ్చే చికిత్స వల్ల 60 నుంచి 70 శాతం, మూడో దశలో 30 నుంచి 40 శాతం వరకు ఆయుష్షును పొడిగించవచ్చు. అయితే నాలుగో దశలో చేసే చికిత్స వల్ల ఆయుఃప్రమాణం పెరిగే అవకాశం ఉందని కచ్చితంగా చెప్పలేం. కాబట్టి క్యాన్సర్ లక్షణాలు కనబడిన వెంటనే గానీ, తొలి దశలోగానీ గుర్తించి చికిత్స అందిస్తే మామూలు జీవితాన్ని గడిపేయవచ్చు.

క్యాన్సర్ నిర్మూలనకు భారీ వ్యవస్థ

క్యాన్సర్ విస్తరణ.. చికిత్స విధానాలు అన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి క్షేత్రస్థాయిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, ప్రాథమిక దశలోనే చికిత్స అందించేందుకు ఓ భారీ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించేందుకు తిరుపతి జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం నుంచి తిరుపతి జిల్లాలో నిర్దేశించిన గ్రామ సచివాలయ పరిధిలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభం కానుంది.

రోజుకు 300 మందికి పరీక్షలు

మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఒక్కో యూనిట్‌లో రోజుకు 300 మందికి పరీక్షలు నిర్వహించే సామర్థ్యంతో ఈ ప్రత్యేక బస్సును డిజైన్ చేశారు. మ్యామోగ్రామ్, సర్వేకల్, నోటి క్యాన్సర్‌కు సంబంధించి క్షేత్రస్థాయికి వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్‌ను నిర్వహిస్తారు. ఇందుకోసం వైద్యులు, టెక్నీషియన్లు, వైద్య సిబ్బంది మొత్తం 17 మందితో స్పెషల్ టీమ్ సిద్ధంగా ఉంటుంది.


వైద్య ఆరోగ్యశాఖ సమన్వయం

మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను జిల్లా వైద్యఆరోగ్యశాఖ సహకారంతో శ్రీబాలాజీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ముందుగానే రూట్ మ్యాప్ ప్రకటిస్తుంది. నిర్దేశించిన గ్రామ సచివాలయ పరిధిలో అక్కడి ఏఎన్ఎం, ఆశా వర్కర్లు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల వివరాలు సేకరిస్తారు. ఇందుకోసం రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఎప్పుడు, ఎక్కడ, ఏ టైమ్‌కు ఉంటుందనే విషయాలను ఇంటింటా వెళ్లి తెలియజేస్తారు. అలా నిర్దేశించిన రోజున ఆ ప్రాంతానికి వెళ్లి మొబైల్ యూనిట్ల ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. రోజుకు రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు.



స్క్రీనింగ్ కోసం రెండు యూనిట్లు

తిరుపతి జిల్లాలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించేందుకు రెండు యూనిట్లను సిద్ధం చేశారు. 17 మంది జట్టుతో ఒక్కో యూనిట్ సిద్ధంగా ఉంది. క్యాన్సర్ నిర్ధారణ కోసం ఒక్కో బస్సుకు రూ.3 కోట్ల వ్యయం చేసి, రెండు స్పెషల్ బస్సులను సిద్ధం చేశారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఫౌండేషన్, అంబుజీ, రోటరీక్లబ్ సంయుక్తంగా ఓ ప్రత్యేక బస్సును స్విమ్స్‌కు విరాళంగా అందజేశారు.



స్క్రీనింగ్ కోసం సమకూర్చిన అత్యాధునిక పరికరాలు

సమాచారం

సమాచారం
క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం సిద్ధం చేసిన బస్సు యూనిట్లు :
రెండు
ఒక్కో యూనిట్లో ఉండే వైద్యుల బృందం :
17 మంది
ఎవరెవరు :
వైద్యులు– 4, నర్సులు – 4, టెక్నీషియన్లు– 2, ఎలక్ట్రీషియన్ –1, డీపీఓ – 1, మెడికో సోషల్ వర్కర్ –1, డ్రైవర్ –1, సెక్యూరిటీ 1, అటెండర్ –2
మొబైల్ స్క్రీనింగ్ యూనిట్లో చేసే పరీక్షలు :
మామోగ్రామ్, సర్వైకల్, నోటి క్యాన్సర్
బస్సులో పరికరాలు :
కోటి విలువైన మ్యామోగ్రామ్, అల్ట్రాసౌండ్, ఓరోస్కోప్, కోల్పోస్కోప్, ఈసీజీ తోపాటు థర్మామీటర్, వెయిటింగ్ మిషన్

ఇది ఆరంభమే



క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. వ్యాధిని ఆదిలోనే గుర్తించాలంటే ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేపట్టాలి. అందుకే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్‌కు సంకల్పించారు. ఆదివారం నుంచి తిరుపతి జిల్లాలో మొబైల్ స్క్రీనింగ్ యూనిట్లు ప్రారంభం కానున్నాయి. వివరాలు నమోదు చేసేందుకు ప్రత్యేక యాప్ సిద్ధం చేశాం.

– డాక్టర్ జయచంద్రారెడ్డి, స్పెషల్ ఆఫీసర్, శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, తిరుపతి

రూట్ మ్యాప్ సిద్ధం



మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించేందుకు జిల్లాలో రూట్ మ్యాప్ సిద్ధం చేశాం. రోజూ వేర్వేరు రెండు ప్రాంతాల్లో రెండు స్పెషల్ బస్సుల ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు చేపడుతాం. క్యాన్సర్ స్క్రీనింగ్ క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేసేందుకు గ్రౌండ్ వర్క్‌ను ఇప్పటికే పూర్తి చేశాం. క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ ప్రాజెక్టుకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ సంసిద్ధంగా ఉంది.

– డాక్టర్ యూ.శ్రీహరి, వైద్యఆరోగ్యశాఖ అధికారి, తిరుపతి జిల్లా

అరచేతిలో మన ఊరి అభివృద్ధి

- 'మన చంద్రగిరి' యాప్‌ను ఆవిష్కరించిన తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం
- ఎక్కడి నుంచి అయినా చేసిన అభివృద్ధిని చూసుకునే వెసులుబాటు



మన చంద్రగిరి యాప్‌ను ఆవిష్కరిస్తున్న తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి: 'మన చంద్రగిరి' ప్రజా యాప్‌ను తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు. మండలంలోని ఐతేపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పల్లెల్లో చేసిన 'ప్రగతి' నివేదికను పది మందికీ తెలిసేలా తయారైన ఈ యాప్‌ను ఆయన అట్టహాసంగా ప్రారంభించారు. ప్రతిఒక్కరూ ఈ యాప్‌ను తమ సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో జన్మించి ఇతర దేశాలలో ఉంటున్న వారంతా తమ గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను ఈ యాప్ ద్వారా తెలుసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. అభివృద్ధి ఎక్కడ జరిందని ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీలకు 'మన చంద్రగిరి' యాప్ పూర్తి సమాధానం చెబుతుందని స్పష్టం చేశారు. యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో చంద్రగిరి ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, ఐతేపల్లి, అగరాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

గరుడుడిపై లక్ష్మీనరసింహుడు



బంగారు గరుడ వాహనంపై ఊరేగుతున్న నరసింహుడు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి శుక్రవారం గరుడవాహనంపై ఊరేగారు. ఉదయం స్వామివారికి చందనాలంకరణ చేశారు. వేకువజామున అభిషేకం, చందనాలంకరణ, శాంతి హోమం, కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారిని బంగారు గరుడ వాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు.

● ఎన్నికల యుద్ధానికి సిద్ధం!



తిరుపతి ఎంపీ క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బెంగళూరు ఐటీ వింగ్ టీంతో కలిసి సిద్ధం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ గురుమూర్తి.

– తిరుపతి మంగళం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల నియామకం

- చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గానికి రెడ్డెప్ప, జీడీ నెల్లూరు అసెంబ్లీ సెగ్మెంట్‌కు నారాయణస్వామి



రెడ్డెప్ప, నారాయణస్వామి

సాక్షి, చిత్తూరు: సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను శుక్రవారం ప్రకటించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం జిల్లా పరిధిలోని రెండు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించింది. ఈమేరకు చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం(ఎస్సీ) సమన్వయకర్తగా ఎంపీ రెడ్డెప్ప, జీడీనెల్లూరు(ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు పేర్కొంది. పార్టీ ప్రకటనపై సర్వత్రా హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప స్పందిస్తూ ముఖ్యమంత్రి జగనన్న, మంత్రి పెద్దిరెడ్డి అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని, పార్టీ గెలుపు కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని వెల్లడించారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ వ్యవస్థపై కలెక్టర్ ఆరా

తిరుపతి రూరల్: జిల్లాలో విద్యుత్ సరఫరా, కొత్త పరిశ్రమలకు అందిస్తున్న రాయితీలు, నెట్‌వర్క్‌ను మెరుగుపరిచేందుకు చేపడుతున్న చర్యలపై తిరుపతి జిల్లా నూతన కలెక్టర్ లక్ష్మీశ ఆరా తీశారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జగనన్న కాలనీల్లో మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రథసప్తమికి భారీ ఏర్పాట్లు

- ఫిబ్రవరి 15, 16, 17 తేదీల్లో ఎస్ఎస్‌డీ టోకెన్లు రద్దు
- ఈవో ఏవీ.ధర్మారెడ్డి



మాట్లాడుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: సూర్యజయంతి సందర్భంగా ఫిబ్రవరి 16వ తేదీ రథసప్తమి పర్వదినానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టీటీడీ భారీ ఏర్పాట్లు చేపట్టనున్నట్లు ఈవో ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ అధికారులు, పోలీస్ అధికారులతో శుక్రవారం ఆయన రథసప్తమి ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ రథసప్తమికి సంబంధించిన ఏర్పాట్లపై అన్నప్రసాదం, ఆరోగ్యశాఖ, ఇంజినీరింగ్ విభాగం, ఆలయం, ఉద్యానవనశాఖ, శ్రీవారి సేవ, భద్రతా విభాగం, ఎస్వీబీసీ, ధర్మప్రచారపరిషత్ తదితర విభాగాధిపతులకు పలు సూచనలు చేశారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు తిరుమలలో ఏడు వాహనాలపై స్వామివారి ఊరేగింపును తిలకించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వివిధ విభాగాధిపతులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

- భక్తులు చలికి, ఎండకు ఇబ్బంది పడకుండా మాడ వీధుల్లో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు. భక్తుల సౌకర్యార్థం 3.5 లక్షల లడ్డూలు బఫర్ స్టాక్ ఉంచుకోవాలి. ఎస్వీబీసీలో వాహ నసేవలను ప్రత్యక్ష ప్రసారం చేయాలి. వాహనసేవల ఎదుట ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు. టీటీడీ నిఘా, భద్రతా విభాగం అధికారులు పోలీసులతో సమన్వయం చేసుకుని మెరుగైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి.
- అన్నప్రసాదం అధికారులు ఉదయం నుంచి రాత్రి వరకు గ్యాలరీలలో వాహనాలను తిలకించడానికి వేచి ఉండే భక్తులకు తాగునీరు, మజ్జిగ, సాంబారు అన్నం, పెరుగు అన్నం, పులిహోర, పొంగలి వంటి అన్న ప్రసాదాలను నిరంతరాయంగా పంపిణీ చేయాలి. భక్తుల దాహార్తిని తీర్చడానికి శ్రీవారి సేవకుల సహకారంతో ఎప్పటికప్పుడు తాగునీరు అందించాలి. మెరుగైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. అత్యవసర సేవలందించడానికి వీలుగా వైద్య సిబ్బంది, మందులు, అంబులెన్సు వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలి.

ఆర్జిత సేవలు రద్దు

రథసప్తమిని పురస్కరించుకొని ఆర్జిత సేవలను రద్దు చేసిన ట్లు ఈవో తెలిపారు. ఆ రోజున ఎటువంటి ప్రత్యేక దర్శనాలు (వీఐపీ బ్రేక్, వయోవృద్ధులు, వికలాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు) ఉండవన్నారు. అదే విధంగా ఫిబ్రవరి 14వ తేదీ తెల్లవారుజామున 12 నుంచి 16వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు టీబీ, ఎంబీసీ – 34 కౌంటర్లను మూసివేసి, సీఆర్‌వో, శ్రీ పద్మావతి విశ్రాంతి భవనాల సముదాయంలో మాత్రమే గదులు కేటాయించాలన్నారు. సమావేశంలో జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్, సీఈవో షణ్ముఖకుమార్, సీఈ నాగేశ్వరరావు, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి, సీపీఆర్‌వో టీ.రవి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన అధ్యయనోత్సవాలు



స్వామి వారికి ఆస్థానం నిర్వహిస్తున్న అర్చక పండితులు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో గత నెల 10వ తేదీన ప్రారంభమైన అధ్యయనోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు ఆలయం నుంచి గోవిందరాజస్వామి, ఆండాళ్ అమ్మవారు, విష్వక్సేనుడు, రామానుజాచార్యులు, నమ్మాళ్వార్, కూరత్తాళ్వార్, తిరుమంగైయాళ్వార్ ఉత్సవమూర్తులను కపిలతీర్థం వరకు ఊరేగించారు. అనంతరం అక్కడ ఆస్థానం నిర్వహించారు. అక్కడి నుంచి బయలుదేరి పీఆర్ గార్డెన్ మీదుగా మధ్యాహ్నం తిరిగి ఆలయానికి వేంచేపు చేశారు. ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనంజయ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మధ్యంతర బడ్జెట్‌పై అవగాహన సదస్సు



పీఆర్‌ఎస్‌ఐ సభ్యులకు సన్మానం

తిరుపతి (అలిపిరి): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్‌ఎస్‌ఐ) తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలోని న్యూ బాలాజీ కాలనీలోని గ్రీన్ హోమ్ డెవలపర్స్ కార్యాలయంలో మధ్యంతర బడ్జెట్–2024పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఇటీవల జాతీయ అవార్డులు పొందిన పీఆర్‌ఎస్‌ఐ సభ్యులు రమాకాంత శర్మ, ఆచార్య త్రిపుర సుందరి, ఎస్.బి.హర్షవర్ధన్ రెడ్డిని సంస్థ చైర్మన్ కె.శ్రీనివాసరావు, కార్యదర్శి డి.చంద్ర మోహన్, ఇతర సభ్యులు సన్మానించారు. ఉపాధ్యక్షుడు చంద్రమోహన్ రావు, కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్ సహాయ కార్యదర్శి సాయికుమార్ రెడ్డి, పద్మావతి మహిళా వర్సిటీ జర్నలిజం ప్రొఫెసర్ సి.వాణి, తిరుపతికి చెందిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జగనే రావాలి.. ప్రగతి మెరవాలి!

చంద్రగిరిలో అట్టహాసంగా కొనసాగుతున్న వై ఏపీ నీడ్స్ జగన్

- విస్తృతంగా పర్యటిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- లబ్ధి చేకూరితే మీరే సైనికులుగా రావాలంటూ పిలుపు



మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మళ్లీ సీఎం జగన్‌నే రావాలని ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. మండలంలోని పనబాకం, కల్‌రోడ్డుపల్లి, ఎంకొంగరవారిపల్లి, ఐతేపల్లి – అగరాల పంచాయతీలలో శుక్రవారం జరిగిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి ' కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు ఆయనకు అడుగడుగునా జనం నీరాజనాలు పట్టారు. డప్పువాయిద్యాలతో ఆత్మీయంగా స్వాగతం పలికారు. అగరాల పంచాయతీలో దిష్టి తీసి.. గజ మాలలతో సత్కరించారు. అనంతరం సభా ప్రాంగణం వరకు ర్యాలీగా తరలివచ్చారు. అన్ని పంచాయతీలలో పార్టీ జెండాలు ఆవిష్కరించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డులను మోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు..

పల్లెలకు సచివాలయ వ్యవస్థ

గ్రామీణ ప్రాంతాలకు సచివాలయ వ్యవస్థను చేరువ చేసి పరిపాలనను సీఎం జగనన్న మరింత సులభతరం చేశారని మోహిత్‌రెడ్డి కొనియాడారు. ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని భావిస్తేనే.. ఓటు వేయండని ధైర్యంగా అభ్యర్థించే హక్కు ఒక్క వైఎస్సార్సీపీకి మాత్రమే ఉందన్నారు. అర్హతే ప్రామాణికంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందజేసినట్లు వెల్లడించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధితో పాటు అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, విద్యాకానుక అందజేసినట్టు తెలిపారు. దేశంలోనే వృద్ధులకు రూ. 3 వేల పెన్షన్ అందజేస్తున్న ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రలో నిలుస్తోందన్నారు. సీఎం జగనన్న ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేశారని గుర్తుచేశారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డి చొరవతోనే

పంచాయతీలలో ఇంత అభివృద్ధి జరిగిందంటే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతోనే సాధ్యమైందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. ఓటు వేసి గెలిపించిన ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించారని, తన సంపాదనలో 70 శాతం నియోజకవర్గ ప్రజలకు ఖర్చు చేశారని స్పష్టం చేశారు. ఆ మేరకు ప్రజలకు పండుగల సమయాల్లో కానుకలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. కరోనా సమయంలో దేశంలోనే ఏ ఎమ్మెల్యే చేయలేనంతగా సాహసం చేసి, ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవ చేశారని గుర్తుచేశారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం వారికి ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు.



సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

పల్లెపథం..ప్రగతి రథం!

- పనబాకం పంచాయతీలో రూ.9 కోట్లతో అభివృద్ధి పనులు.
- కల్‌రోడ్డుపల్లి పంచాయతీలో రూ.6 కోట్లతో, యం.కొంగరవారిపల్లిలో రూ.9.85 కోట్లు, ఐతేపల్లి
- అగరాలలో రూ.6 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు.
- సంక్షేమ పథకాల ద్వారా పనబాకం ప్రజలకు రూ.28.06 కోట్లు.
- కల్‌రోడ్డుపల్లిలో రూ.17.38 కోట్లు, యం.కొంగర వారిపల్లిలో రూ.18.41 కోట్లు

మోహిత్ వెంట ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు యుగంధర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి, దక్షిణ డివిజన్ పార్టీ అధ్యక్షులు దేవారెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు డెప్యూటీ సీఎం సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న డెప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుపతి అర్బన్: జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జీ.లక్ష్మీషాను శుక్రవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా పలువురు కలిశారు. ప్రధానంగా డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి కలెక్టర్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ మురళీధర్‌తోపాటు పలువురు నేతలు కలెక్టర్‌ను కలిశారు. ఆయనకు అభినందనలు తెలిపారు.



కలెక్టర్‌తో స్థానిక ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ మురళీధర్

అలసత్వం వహిస్తే ఉపేక్షించం



సామాజిక తనిఖీ బహిరంగ సభలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో ఎవరైనా అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణలో 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు వెంకటగిరి రూరల్ మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన శుక్రవారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని 20 పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రూ. 6.49 కోట్ల నిధులు పనులకు వెచ్చించినట్లు తెలిపారు. ఇందులో జరిగిన అవకతవకలకు సంబంధించి రూ. 62,936 రికవరీకి ఆదేశించగా పనుల్లో అలసత్వం వహించిన వారిపై రూ.9,522 జరిమాన విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, రామనాయుడు, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, ఎస్‌ఆర్‌పి నాగరాజు, ఎంపిడిఓ నీలకంఠేశ్వరరెడ్డి, ఏపీఓ దీప తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి శుభ్రతకే తొలిప్రాధాన్యం

తిరుపతి తుడా : తిరుపతి నగర పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ తెలిపారు. ఆమె శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి నగరంలోని 23, 24, 25, 28 వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణపై తనిఖీ చేశారు. ఎన్టీఆర్ సర్కిల్, మహతి, రామకృష్ణ డీలక్స్ సర్కిల్, వివేకనంద సర్కిల్, అలిపిరి, స్విమ్స్ సర్కిల్, గిరిపురం, శాంతినగర్ ఏరియాల్లోని కొన్ని హోటళ్లను పరిశీంచి ఆహార నాణ్యత, కిచన్ పరిశుభ్రతను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతికి నిత్యమూ లక్షల్లో వస్తున్న యాత్రికులను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహారం అందజేయాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలని, పారిశుద్ధ్య సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.



తడి, పొడి చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 57,223 మంది స్వామివారిని దర్శించుకోగా 18,015 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.44 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఎస్వీ జూలో చిత్తడి నేలలపై విద్యార్థులకు అవగాహన

తిరుపతి మంగళం : ఎస్వీ జూపార్క్‌లో శుక్రవారం ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జూ క్యూరేటర్ సెల్వం వివిధ పాఠశాలల విద్యార్థులకు చిత్తడి నేలలపై అవగాహన కల్పించారు. జంతు పరిరక్షణ, వాటి ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులతో పేపర్లతో వివిధ రకాల పక్షులు, జంతువుల బొమ్మలను తయారుచేయించి ప్రోత్సహించారు.

ఆదర్శప్రాయుడు .. వివేకానందుడు



నివాళులర్పిస్తున్న రామకృష్ణ మిషన్ ఆశ్రమ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: స్వామి వివేకానందను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమం కార్యదర్శి స్వామి సుకృతానంద తెలిపారు. శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఎస్వీ మెడికల్ కళాశాల సర్కిల్‌లోని స్వామి వివేకానంద విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శీల సంపద కలిగి ఉండాలనే విషయాన్ని యువత గుర్తించుకోవాలని తెలిపారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్య నందన్ భట్ మాట్లాడుతూ వివేకానందుని సేవా యోగం గురించి వివరించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఉదయం ఆశ్రమంలో ప్రత్యేక హోమం చేపట్టారు.

కొండను ఢీకొన్న కారు

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో కారు అదుపు తప్పి కొండను ఢీకొన్న సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... తమిళనాడు, చెన్నైకి చెందిన నలుగురు భక్తులు కారులో తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం కారులో మొదటి ఘాట్ రోడ్డులో కిందకు దిగుతుండగా ఆఖరు మలుపువద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రక్షణ గోడను ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు పరిశీలిస్తున్నారు.

మందుబాబుల వీరంగం



మంటల్లో కాలిపోతున్న మోటార్ సైకిల్

కోట: స్థానిక మహాలక్ష్మమ్మ వీధిలో గురువారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఇద్దరు యువకులు వీరంగం సృష్టించారు. పోలయ్య అనే వ్యక్తికి చెందిన గడ్డివామికి నిప్పుపెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. మరో వీధిలోకి చొరబడి ఇంటి ముందు నిలిపి ఉంచిన హీరోహోండా మోటార్‌సైకిల్‌ను తగులబెట్టారు. అర్ధరాత్రి మంటలను చూసిన స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం స్థానికులంతా పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఎస్ఐ నాగబాబుకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.